ఇందిరమ్మ ఇళ్లపై కసరత్తు!

- జాబితా రూపొందించాలని కమిటీ సభ్యులకు ఆదేశాలు
- ప్రతి గ్రామానికి మొదటి విడతలో 10 నుంచి 25 వరకు ఇళ్లు
- మంజూరు కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్న పేదలు



తాండూరు రూరల్: పేదోడికి ఇళ్లు నిర్మిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేసింది. ఇప్పటికే మండలంలో ఓ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తి చేసింది. ప్రస్తుతం ఆ గ్రామాల్లో ఇంటి నిర్మాణాలు కొనసాగుతున్నాయి. తాజాగా 2025–2026 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా ప్రతి మండలానికి 650 ఇళ్లను కేటాయించే విధంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషి చేస్తున్నారు. పైలెట్ ప్రాజెక్టు గ్రామాన్ని మినహాయించి మిగత గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించాలని క్యాంప్ కార్యాలయం నుంచి గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, పార్టీ నాయకులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఒక్కో గ్రామానికి 10 నుంచి 25 ఇళ్ల వరకు ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది.

సమన్వయంతో ఎంపిక సాగేనా..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లోని నిరు పేదలకు ఒక్కరికి కూడా ఇళ్లు మంజూరు కాలేదు. ఇళ్లులేని పేదలకు పక్కాఇళ్లు నిర్మిస్తామని కాంగ్రెస్ హామీ ఇవ్వడంతో ఇంటి మంజూరు కోసం పేదలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పాటు కాంగ్రెస్ నాయకులు ఒకచోట కూర్చొని జాబితాను రూపొందించాలని ఎమ్మెల్యే నుంచి ఆదేశాలు వెళ్లాయి. అయితే గ్రామాల్లో ఇప్పటికే అధికార కాంగ్రెస్‌లో వర్గపోరుతో సతమతమౌతున్నారు. ఈ ఇందిరమ్మ ఇళ్ల జాబితా సమన్వయంతో సజావుగా ఎంపిక జరుగుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాల్లో పాత, కొత్త కాంగ్రెస్ నాయకుల మధ్య మనస్పర్థలు ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల జాబితా ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎమ్మెల్యే వద్దకు ఎన్ని పంచాయితీలు జరుగుతాయే అని కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు.

పేదలకే మొదటి ప్రాధాన్యం

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జాబితాలో ముందుగా గ్రామాల్లోని పేదలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. గుడిసెలో ఉండే పేదలు, పక్కాఇళ్లు లేనివారు, వికలాంగులు, పంచాయతీ కార్మికులను ఎంపిక చేయనున్నారు. అయితే ఒక్కో గ్రామానికి 10 నుంచి 25 వరకు మంజూరు చేస్తే మిగత వారి నుంచి వ్యతిరేకత వస్తుందని గ్రామంలోని నాయకులు చర్చించుకుంటున్నారు. ఒకరికి ఇస్తే మరొకరి సంగతేంటి అనేది సందేహంగా ఉంది. ఆ ప్రభావం స్థానిక ఎన్నికల్లో పడే అవకాశం ఉందని మరికొందరు నాయకులు అంటున్నారు. ఎవరిని ఎంపిక చేయాలో అనే విషయంపై నాయకులు తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

వెరిఫికేషన్ కమిటీ ఆమోదం

గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు రూపొందించిన జాబితాను క్యాంప్ కార్యాలయానికి పంపిస్తారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ఆమోదంతో జిల్లా కలెక్టర్‌కు జాబితా వెళ్తుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని వెరిఫికేషన్ అధికారులతో కూడిన కమిటీలో పంచాయతీ రాజ్ ఏఈ, మండల వ్యవసాయ శాఖ అధికారి, మండల విద్యాధికారి ఉంటారు. వీరు ముగ్గురు గ్రామాలకు వెళ్లి జాబితాలో ఉన్న వారికి ఇంటి జాగ ఉందా? పక్కా ఇళ్లు ఉందా? అని క్షేత్రస్థాయిలోకి వెళ్లి వెరిఫికేషన్ చేస్తారు. అనంతరం వెరిఫికేషన్ కమిటీ తనిఖీ తర్వాత గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జాబితాను గ్రామ పంచాయతీల్లో ప్రచురిస్తారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఇప్పటికే కమిటీ సభ్యులు, నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎవరికి ఎంపిక చేయాలనే తర్జనభర్జన పడుతున్నారు. గ్రామాల్లోని కార్యకర్తల నుంచి కమిటీ సభ్యులకు ఫలాన వ్యక్తిని ఎంపిక చేయాలి అని ఒత్తిడిలు మొదలయ్యాయి. ఎంపిక సజావుగా సాగుతుందా? ఏమైన గందరగోళంగా మారుతుందా? అనేది వేచి చూడాలి.

బోసిపోయిన కోట్‌పల్లి ప్రాజెక్టు



పర్యాటకులు లేక వెలవెలబోతున్న ప్రాజెక్టు

- తగ్గిన పర్యాటకుల రాక
- ఇబ్బందుల్లో చిరు వ్యాపారులు

ధారూరు: జిల్లాలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల రాక క్రమంగా తగ్గింది. దీనికి రాష్ట్ర స్థాయిలో పర్యాటక ప్రాంతంగా గుర్తింపు ఉంది. ప్రతీరోజు ఇక్కడికి పర్యాటకులు వందల్లో వచ్చేవారు. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాల్లో వేల సంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం వీరి సంఖ్య రెండంకెలు కూడా దాటడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పెరుగుతున్న ఎండలు, అకాల వర్షాలతో పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. దీంతో ఈ ప్రాంతంలో చిరువ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి ఆయా వస్తువుల అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని చెబుతున్నారు. అనంతగిరి గుట్టలో కొలువైన అనంతపద్మనాభస్వామి ఆలయానికి వస్తున్న పర్యాటకులు ధారూరు మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టును సందర్శించకుండానే వెనుదిరుగుతున్నారు. విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు ముగిసాయి. వేసవి సెలవులు వచ్చినప్పటికీ పర్యాటకుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. గత నెల రోజుల క్రితం పర్యాటకులతో బాసిల్లిన ప్రాజెక్టు ప్రాంతం నేడు బోసిపోయి వెలవెలబోతోంది. వేసవి సెలవులు ముగిసే సరికి కుటుంబాలతో కలిసి పర్యాటకులు ప్రాజెక్టును సందర్శిస్తారో లేదో ముందుముందు తెలుస్తుంది.

కొలతల ప్రకారమే కూలి

- ఎంపీడీఓ విశ్వప్రసాద్
- చెన్‌గేస్‌పూర్‌లో ఉపాధి హామీ పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న విశ్వప్రసాద్

తాండూరు రూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేస్తున్న పనులకు కొలతల ప్రకారమే కూలి చెల్లిస్తామని ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్‌లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పనులు చేయాలన్నారు. తక్కువ కొలతలు గల పనులు చేస్తే తక్కువ డబ్బులు చెల్లిస్తామన్నారు. కావున కూలి ఎక్కువగా గిట్టుబాటు కావాలంటే నిబంధనల ప్రకారం పని చేయాలని సూచించారు. వేసవికాలం దృష్ట్యా కూలీలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం తొందరగా వెళ్లి పనులు ముగించుకొని ఇంటికి చేరుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మిషన్ భగీరథ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ జయలక్ష్మి

దుద్యాల్: మండల పరిధిలోని నాన్య నాయక్ తండాలో జరుగుతున్న మిషన్ భగీరథ పనులను క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ జయలక్ష్మి గురువారం పరిశీలించారు. రూ.6,20,000లు కడా ప్రత్యేక నిధులతో చేపడుతున్న తండాలో మిషన్ భగీరథ ఇంటింటి నల్ల పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా జయలక్ష్మి ఇంటింటికి ఇచ్చిన నల్ల కనెక్షన్‌కు నీటి సరఫరా అందుతుందా? లేదా? అని పరిశీలించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్వహిస్తున్నందుకు కాంట్రక్టర్‌ను ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కొడంగల్ ఏఈ శ్రీకాంత్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

వీధి నాటకానికి విరాళం



దస్తయ్య దంపతులను సన్మానిస్తున్న వీధినాటక నిర్వాహకులు

దోమ: వీధినాటకాల ద్వారా ప్రజలను ఉత్సాహపరిచి, చరిత్రను మరోమారు ప్రత్యక్షంగా ప్రదర్శించడం ఎంతో సంతోషకరమని పాలెపల్లి గ్రామానికి చెందిన జొగు దస్తయ్య దంపతులు పేర్కొన్నారు. గురువారం పాలెపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీరామ పట్టాభిషేకం వీధి నాటకానికి రూ. 10వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో నిర్వహించే ప్రతీ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంతులు నర్సింలు, ఆత్మలింగం, కిష్టయ్య, వెంకటయ్య, ముక్కు బసప్ప, బచ్చిగారి బసప్ప, తదితరులు పాల్గొన్నారు.

సలావుద్దీన్‌కు ఘన సన్మానం

తెలంగాణ ఉద్యమకారుడికి దక్కిన గౌరవం



సలావుద్దీన్‌కు అవార్డు అందజేస్తున్న శంకరమ్మ తదితరులు

బంట్వారం: తెలంగాణ ఉద్యమ కారుడుకి గౌరవం దక్కింది. నింగి నేల మేము సైతం సంస్థ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని బాలాపూర్‌లో బంట్వారం మండలం బొప్పునారానికి చెందిన డాక్టర్ సలావుద్దీన్‌కు పలువురు ప్రముఖులు శ్రీకాంతచారి మెమోరియల్ అవార్డును అందజేశారు. శ్రీకాంతచారి మాతృమూర్తి కాసోజు శంకరమ్మ ప్రముఖ గాయకుడు దరువు అంజన్న, జాజుల శ్రీను అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ శ్రీకాంతచారి మెమోరియల్ ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కులగణన నిర్వహణ అభినందనీయం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: జనగణన, కులగణన నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు, కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఘణపురం వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశంలో 2011లో నిర్వహించిన జనగణన అనంతరం మళ్లీ జనగణన నిర్వహించలేదు. దీంతో ప్రస్తుతం జనగణనతో పాటు కులగణన సైతం నిర్వహించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్, జిల్లా కార్యవర్గసభ్యుడు మైపాల్, దిశ కమిటీ జిల్లా సభ్యుడు జానకిరాం చౌహాన్, నాయకులు శ్రీశైలం, రాజేందర్, రాంచంద్రయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఏర్పుమళ్లలో ఈ నెల 4న నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అంబేడ్కర్ సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని తుంకిమెట్ల, బొంరాస్‌పేటలో డప్పులు కొడుతూ, నినాదాలిస్తూ ఊరేగింపు నిర్వహించి ఆటాపాటలతో సమావేశం నిర్వహించి గోడపత్రికలు ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘం అధ్యక్షుడు చంద్రయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, కేఎన్‌పీఎస్ మండల అధ్యక్షుడు కొత్తూరు అంజిలప్ప, మాసని వెంకటయ్య, తోలు వెంకటయ్య, విగ్రహావిష్కరణ కమిటీ నాయకులు ఈశ్వర్, ముని, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురువారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500ల బోనస్‌ను అందిస్తుందని తెలిపారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంద, దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గండ్ర జగదీశ్వర్‌గౌడ్, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ వీరేశ్ సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ అనిల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులు సిబ్బందితో ప్రమీల

పరిగి: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్ అన్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన న్యూబ్రిలియంట్ హైస్కూల్ విద్యార్థులను గురువారం ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సుశీల, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే విజయం



అభినందిస్తున్న దృశ్యం

అనంతగిరి: ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం తప్పక వరిస్తుందని ఏసీఆర్ భృంగీ విద్యాసంస్థల కరస్పాండెంట్ ప్రమీలచంద్రశేఖర్ అన్నారు. టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థులతో పాటు ఇందుకు కృషిచేసిన సిబ్బందిని గురువారం ఆమె అభినందించారు.

క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎంఈఓ వెంకట్

దోమ: విద్యార్థులు సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వెంకట్ తెలిపారు. గురువారం దోమ మండల పరిధిలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో సమ్మర్ క్యాంపులు, కృత్రిమ మేధా తరగతులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు షఫీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దన్నారు. చదువుపై దృష్టిపెట్టాలని, గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు చిన్నారులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. విద్య పట్ల నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్ ఇబ్బందికరంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోళ్ల సురేశ్, మాజీ ఎంపీటీసీ రాములు, స్కూల్ చైర్మన్ నసీమాబేగం, వార్డు సభ్యులు చంద్రశేఖర్ ముదిరాజ్, గ్రామస్తులు బషీర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ అవార్డు రావడం హర్షణీయం

బొంపల్లి పాథమిక పాఠశాలకు కృత్రిమ మేధతో బోధనలో ఇండో గ్లోబల్ అవార్డు 2025 రావడం హర్షణీయమని ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బొంపల్లి పాఠశాల ఎంపిక కావడం, పాఠశాల అత్యంత ప్రతిభ చూపించడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.

గ్రామ కార్మిక సంఘం అధ్యక్షుడిగా రాములు



బొంరాస్‌పేట: మండల పరిధిలోని రేగడిమైలారంలో గురువారం గ్రామ కార్మిక సంఘాన్ని ఎన్నుకున్నారు. గురువారం కమిటీ అధ్యక్షుడిగా ముసులగళ్ల రాములు, ఉపాధ్యక్షుడిగా కర్రె అబ్దుల్, కార్యదర్శిగా ప్యాట హన్మంతు, కోశాధికారిగా చిన్న కాశప్పను నియమించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.



పరిగి: జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



తాండూరు: మున్సిపల్ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షురాలు విజయలక్ష్మి పండిత్



కుల్కచర్ల: ప్రధాన చౌరస్తాలో మేడే వేడుకలో కార్మిక సంఘం నాయకులు



బొంరాస్‌పేట: జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య

కార్మిక సంక్షేమానికి కృషి

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణ కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ తదితరుల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టాలని, పనికి తగ్గ కనీస వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతూ, సాధించుకున్న 8 గంటల పనిని కాపాడుకోవాలన్నారు.



బంట్వారం: కోట్‌పల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్



అనంతగిరి: వికారాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ



తాండూరు రూరల్: అదానీ ఫ్యాక్టరీ వద్ద జెండావిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



యాలాల మండల కేంద్రంలో మే డే



మోమిన్‌పేట: మొరంగపల్లి బస్టాండు వద్ద జెండా ఎగురవేస్తున్న కార్మికులు



కొడంగల్ రూరల్: లాల్‌దర్బార్‌లో ఏఐటీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



మర్పల్లి: కొత్లాపూర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి మైపాల్

ఇంచార్జి తహసీల్దార్‌గా డీటీ

యాలాల: ఇంచార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. గురువారం తహసీల్దార్ అంజయ్య ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో డీటీ ఇంచార్జిగా వ్యవహరించనున్నారు. యాలాలకు కొత్త తహసీల్దార్‌ను కేటాయించే వరకు డీటీ ఇంచార్జిగా ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తారు.

ప్రత్యేక కార్యాచరణతో ఫలితాలు

యాలాల: పదోతరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక కార్యాచరణతో మంచి ఫలితాలు సాధించామని బీసీ బాలికల వసతి గృహ సంక్షేమాధికారి భాగ్యలక్ష్మీ తెలిపారు. బుధవారం వెలువడిన పదోతరగతి పరీక్షల ఫలితాల్లో 20 మందికి 19 ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మర్పల్లి: మండల పరిధిలోని కొత్లాపూర్ గ్రామానికి చెందిన రాములుయాదవ్ కుమారుడు విజయ్‌కుమార్ వివాహం మండల కేంద్రంలోని ఎంసీఎం ఫంక్షన్ హాల్లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హాజరై వధువరులను అంక్షంతలు వేసి ఆశీర్వదించారు. ఆయన వెంట మర్పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మధుకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు అశోక్, యూత్ ప్రెసిడెంట్ మధుకర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గౌస్, టౌన్ ప్రెసిడెంట్ గఫార్, నీలి శ్రీకాంత్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.